కథానిక

# తిరిగివచ్చిన దీపావళి

ఇచ్ఛాపురపు జగన్నాథరావు

సన్నగా వినిపిస్తూన్న సంగీతానికి క్రమంగా తెలివివచ్చింది శ్యామలకి. ఒకసారి బద్ధకంగా వత్తిగిల్లి కళ్లుమూసుకుని అలాగే పడుకున్నది మంచంమీద. కళ్లు విప్పాలని అనిపించలేదు... బాధకలిగించే ఈ వాస్తవికతని చూడాలని శ్యామలకి అనిపించలేదు.

సంగీతం బాగుంది...వీణానాదంలో ఎంత సౌందర్యం ఉందని!...ఉదయం మరీ కోమలంగా అందంగా ఉంటుంది సంగీతం. ఉదయం మరీ సౌందర్యవంతంగా, దేవత్వంలా ఉంటుంది వీణా నాదం...అలా అనుకుంది శ్యామల.

పచ్చటిపొలాల వొడ్డున కూర్చుని, గట్లు కని పించకుండా పెరిగిన ఆ మొక్కలవంకచూస్తోంది తను...కళ్ళుచూడగలిగినంత మేర, మనసు ఊహించుకోగలిగినంతదూరం. ఆ పచ్చదనం ఎంతో హాయిగా ఉంది...చిన్న చిరుగాలులకి తలలు వూపుతూ నృత్యంచేస్తూన్న ఆ మొక్కలతో తానూ కలిసి ఆడితే!...

కలిగిపోయింది కల. మళ్ళీ వీణానాదం...

మళ్ళా కరిగిపోయింది నిజం, మళ్ళా శ్యామల కరిగిపోయింది తన కలల్లోకి.

ఈసారి తాను సముద్రపు వొడ్డున కూర్చున్నది. ఇసుకలో బొమ్మలుగీసుకుంటూ... కెరటాలు పందేలు వేసుకుని వచ్చినట్లు వస్తున్నాయి. తాను బొమ్మలుగియ్యడం మానేసింది-వాటిని చూసేందుకని. అవి తనని చూసి చిరునవ్వునవ్వినట్లనిపించింది...తానూ నవ్వింది లేతగా.

కెరటాలు మళ్ళీ నవ్వాయి. తానూ నవ్వుతున్నది. కెరటాలతో ఆడుకోవాలనిపించింది శ్యామలకి. ఆ నీలిరంగులో ఏముందో తెలుసుకుని, కొంచెం తెచ్చుకోవాలనిపించింది. తాను చేతులు చాచింది. కెరటాలు వెనక్కిపోయాయి. తనూ వాటి వెనకాల పరుగుపెట్టాలనిపించింది. ఎవరో ఆపారు. ఎవరో...

సముద్రం త్వరగా కరిగిపోయింది. అంతా కల. సంగీతంమాత్రం వినిపిస్తూనే ఉంది.

నెమ్మదిగా కళ్లుతెరిచింది శ్యామల. ఒక్కసారి ఆ మగత అంతా వొదిలిపోయింది. ఎదురుగా ఆయన నిలబడిఉన్నాడు-తనకళ్ళల్లోకే సూటిగా చూస్తూ-

ఆ చూపు కిరణాలలాగ తనకళ్ళలో పడుతూన్నది. శ్యామల కొద్దిక్షణాలు నిద్రకీ, తెలివికీ మధ్యన ఉన్న లోకాలలో ఉండిపోయింది.

తెల్లటి పంచె, తెల్లటి కళ్ళీచొక్కా, శుచిగా తలంటుకున్న శరీరం. ముఖాన లేత చిరునవ్వు, సత్యం అలాగే ఆమెకి ఎదురుగా నిలబడి చూస్తున్నాడు.

"దీపావళి వొచ్చింది శ్యామలా!"

అవునన్నట్లు ఎక్కడో టపాకాయి పేలింది.

"చూశావా? సాక్ష్యంకూడా!"

అతను చిరునవ్వు నవ్వుతూ ఆమె ప్రక్కన కూర్చుని, రెండువైపులా రెండుచేతులూ వేశాడు కళ్ళల్లోకి సూటిగా చూస్తూ.

తనకళ్ళని మరల్చుకోవడానికే ప్రయత్నిస్తోంది. అతనుమాత్రం వాటిని పట్టుదలగా వెంబడిస్తున్నాడు.

"లేవాలని-లేదుకదూ?"

ముఖంమీదిముంగురులని సున్నితంగా వెనక్కితోస్తూ అన్నాడు సత్యం.

ఆమె మాట్లాడలేదు.

"దీపావళి - శ్యామలా!... ఈ చీకట్లో దీపాలుపెట్టి వెలుతురు తెస్తారు. నక్షత్రాలతో పోటీచేస్తూ ఈ దీపాలు... ఎంత ఆనందంగా ఉంటాయి!...కదూ?"

అతనుచూపు త్రిప్పడు—ఆమెకళ్లు మరల్చుకోలేదు.

"మనఇంట్లో...దీపాలు ఉదయమే పెట్టేరు!"

శ్యామల తెల్లబోయినటు చూసింది-ఒక్కక్షణం.

"నిజం. ఈగదిలో దీపాలు చూపనా?"

అర్థంకానట్లు చుట్టూచూడబోయింది శ్యామల.

"వొట్టి మంచిదానివి!" ఆమెకళ్ళని వెంటాడుతూనే అన్నాడు సత్యం చిరునవ్వుతో.

ఆమె మాట్లాడలేదు-అలా నేచూస్తూ...

"ఏం తెలీలేదా ... దీపాలు నీకళ్ళలో నేఉంటే నీకెలాకనిపిస్తాయి? అద్దం తేనా?"

అప్పటికి శ్యామలకి అతని ఉద్దేశం బోధపడింది. అతని కళ్ళల్లోని వెలుతురు కనిపించింది. ఆకాంతీ, అతని అంతరంగంలోని ప్రశాంతతా ఒక్కసారి ఆమెకి తెల్లవారిందనే విషయాన్ని జ్ఞాపకం తెచ్చాయి. సిగ్గుపడి లేవబోయింది.

"మాట్లాడవ్ శ్యామా!"

అవును...తాను మాటలాడలేదు...మాటలాడదు. అతనికళ్ళ మెరుపులోకిచూస్తూ తానేమని మాటలాడగలదు? తనకి కనిపించేది ఇక్కడా అక్కడా, అంతటా చీకట్లే. ఆ దీపాలు తనకేమి కనిపిస్తాయి?

"నేనలా అనుకోలేదులే"

నెమ్మదిగా అని, అతను చేతులుతీశాడు. లేచి త్వరగా అవతలిగదిలోకి వెళ్ళిపోయింది శ్యామల. అతను చివరఅన్న మాటలు పదేపదే మననంచేసుకుంటూ.

అద్దంతీసి, ఒక్కసారి వెలుతురులో చూసుకున్నది.

కళ్లు...కళ్లు—అంతే. అందులో అతనికేమిటి కనిపిస్తాయి? దీపాలు...దీపాలు...

అద్దం నెమ్మదిగా క్రిందనుంచి బ్రష్‌తీసుకుని వరండాలోకి వచ్చింది శ్యామల...అక్కడా అక్కడా దీపావళివొచ్చిన విషయానికి గట్టి సాక్ష్యాలు వినిపిస్తున్నాయి.

వొద్దనుకొన్నకొద్దీ శ్యామలమనస్సులో దీపాల వరుసలూ, మెరిసే బాణసంచా పదేపదే మెదలసాగాయి. అతని మాటలూ, ఆ కళ్ళలో తాను గమనించిన ఉత్సుకతా, ఆప్యాయమూ, పదేపదే ముళ్ళలాగ గ్రుచ్చుకుంటున్నాయి.

రెండేళ్ళక్రితం ఆ దీపావళినాడు తాను తలంటి నీళ్ళుపోసుకున్నది... తెల్లటి చీరకట్టుకున్నది...నీలి బ్లౌజు వేసుకున్నది...తలఅంతా విరియబోసుకుని ఆరవేసుకుంటూ...

చేతిలో బ్రష్ నెమ్మదిగా ఆగిపోవడతో శ్యామలకి తెలివి వొచ్చింది. వొద్దు..వొద్దు..అనుకున్నది. ఆ కథఅంతా ఎందుకు జ్ఞప్తికని విచారించడం! ఆ రోజులు తిరిగి వొస్తాయా? తొందరగా పళ్లుతోముకుని, ముఖంకడుక్కుని, తిరిగి గదిలోనికి వెళ్ళిపోయింది శ్యామల. ఆలోచనలని బలవంతాన ఆపుచేసుకుంటూ.

సత్యం నిలబడి కిటికీలోనించి చూస్తున్నాడు. శ్యామల నెమ్మదిగావచ్చి టేబిల్ దగ్గర కూర్చుంది. కుక్ కాఫీతెస్తే...

"రేడియో కట్టేసేదా?"

"నీ ఇష్టం"

తేలికగా అంది శ్యామల. అతను రేడియో కట్టేసివచ్చి తనదగ్గర నిలబడ్డాడు. వంటవాడు కోపాతో కాఫీ,కప్పులూ టేబిల్ పైనపెట్టివెళ్ళాడు.

ఆమె కోపా తీయబోయింది.

"ఇవాళ నాది" అన్నాడు సత్యం.

కప్పులో కాఫీ పోస్తూ, "ఒకటడగనా శ్యామలా?" అన్నాడు నెమ్మదిగా సత్యం.

"ఏమిటి?"

"మనని గురించి..."

నిశ్శబ్దంగా కాఫీతాగడం ముగించి పేపరు తీసుకుంది శ్యామల...ఏం జవాబు చెప్పడానికీ ఆమెకి పాలుపోలేదు.

"అడగనా శ్యామా?"

నెమ్మదిగా మళ్ళా అడిగాడతను.

"ఊఁ..."

"నిన్ను సుఖపెట్టడానికినేనేంచేసేదిశ్యామా?"

"ఏమీ వొద్దు...నాకు సుఖంగానే ఉంది"

శ్యామల యాంత్రికంగా అన్నది...ఈరోజులన్నిటిలోనూ ఆ ప్రశ్న సుమారుగా రానే వొచ్చింది ఎన్నోసార్లు. ఇవాళ మరికొంత స్పష్టంగా వచ్చింది—అంతే.

"అయితే, మనకింక మార్గాంతరం లేదంటావు..."

"లేదు..."

"ఇలాగే, పొడిగా బ్రతుకుదామా శ్యామా?"

"అది మనచేతుల్లో లేదులెండి...మనం చేసుకున్నదే మన చేతిలో ఉండదు! చెయ్యనిది ఎలా ఉంటుంది?"

అతను నెమ్మదిగా బయటికి వెళ్ళాడు. అతను తిన్న దెబ్బ ఆమెకి తెలుసు... ఎందుకో జాలి అనిపిస్తుంది కూడా. కాని, నిజాన్ని దాచినకొద్దీ నిప్పులాగ అది రగిలి బాధించడంకన్న ఫలితం ఉండకపోవచ్చు. నిజాన్ని దాచడమూ తన ఉద్దేశం కాదు.

రెండేళ్ళ క్రితం...

తను తల ఆరవేసుకుంటూ, గార్డెన్‌లో కూర్చున్నది. అంతా పండగ హడావుడి. తనకే మనస్సులో ఏవో ఆలోచనలు సాగుతున్నాయి. ఆ పచ్చటి చెట్లూ, రంగురంగుల పూవులూ తన మనస్సులో ఏవో గిలిగింతలు పెడుతూ తనకి ఆలోచనల్లో ఊగులాడిస్తున్నాయి-జోకొడుతూ.

ఆ క్షణంలో తాను కొంచెం మగతలోకి జారిందన్నట్లనిపించింది. అతని చక్కని విగ్రహం తన కళ్ళల్లో నాట్యం చెయ్యసాగింది.

అతను, దైవమూర్తి అనుకున్నది తాను.

ఆ క్షణంలో తనకెందుకో అతనెన్ని రెట్లో దైవత్వాన్ని దాచుకున్నట్లు కనిపించాడు.

అప్పటికి తాను ఆరు నెలలనుంచి చూస్తూన్నది. అతనెన్నడూ గట్టిగా మాటలాడలేదు. అనవసరంగా ఎవరితోనూ జోక్యం కలుగజేసుకోలేదు. వచ్చి నాన్నగారి లైబ్రరీలోకి వెళ్ళేవాడు. తనకి కావాల్సిన పుస్తకాలు తీసుకుని, చదివి, నోట్సు వ్రాసుకొనేవాడు. టైమ్ అయాక లేచి ఫైలుతీసుకుని వెళ్ళిపోయేవాడు.

తాను తోటలో కూర్చుని ఉండేది; ఉదయం సాయంత్రం గేటు తీసుకుని లోపలికి వచ్చి తన ముందరినించే లోపలికి వెళ్ళిపోయేవాడు-ఎన్నో సార్లు అతను ఆగి, ఒక్కమాట ఆడతాడని తాను ఆశపడేది.

ఊహూఁ ఎన్నాడూ-ఆర్నెల్లలో రోజూ ఈ కార్యక్రమం సాగుతూన్నా, అతను తన ముందాగలేదు. తిన్నగా వచ్చి వెళ్ళిపోయేవాడు.

ఒకసారి నాతో మాటలాడితే! అనుకునేది తను. ఎందుకని తన ఆత్రుత గ్రహించడు? అనుకొనేది మొదట కోపం వచ్చింది. తరవాత అసహ్యంవేసింది-కాని తరవాత అణచిన కొద్దీ తన ఓటమి తనని మరీ కరిగించాక తాను అలా జరుగుతుందని ఆశించేది. ఏవో అందరాని గొప్ప విషయంలాగ కనిపించేవాడతను.. గంభీరంగా, ప్రశాంతంగా తానెన్నాళ్లో కలగన్నట్లు.

ఆనాడు అతనురాడు-దీపావళికైనా సెలవు తీసుకోడూ? ఎందుకో అతను రాడనుకుంటేనే తనకి కష్టం అనిపించింది.

అలానే తాను కూర్చున్నది. ఇవన్నీ ఆలోచించుకుంటూ.

కొద్దినిముషాలు గడిచాయి. చిన్న నిద్రనించి మెలకువ వొచ్చినట్లైంది. ఎదురుగా అతను నిలబడి ఉన్నాడు.

ఆ క్షణంలో తాను ఎంత ఆశ్చర్యపడ్డదో శ్యామల ఎప్పటికే మరిచిపోలేదు. కలలన్నీ నిజమై, కలగాని ఆశలు నిజమై.

తాను తెల్లబోయి చూసింది.

"క్షమించాడి" అన్నాడతను.

"ఎందుకు?" అనబోయింది శ్యామల కాని.

"మీనిద్ర పాడుచేశానా?"అని అడిగా డతను.

"లేదు" అన్నది తాను.

"కళకోసం మీ నాన్నగారి లైబ్రరీ ఆరు నెలనించి గాలిస్తున్నాను. ఎన్నో విషయాలు తెలుసుకున్నా ననుకున్నాను, కాని"

ఏమిటి? ఏమిటి?

"ఇవాళ క్రొత్తగా నేను చిత్రించాల్సిన దేమిటో గమనించ గలిగాను. మీరు నిద్రిస్తూన్నప్పుడు ఆ సౌందర్యం నే నెన్నడూ ఊహించలేకపోయి ఉందును. ముఖ్యంగా ఆ తెల్లటి ఫాలభాగం మీద పడుతూన్న ఆ ముంగురుల సౌందర్యం క్షమించండి - అతిగా మాట్లాడుతున్నానా?"

ఏమిటోలా ఉంది శ్యామలకి. తాను కలగంటూన్నదా?

"ఏటన్నిటినీమించి ఆ కళ్ళు మీరు దేవతాస్వరూపులు. కళ్ళని నేను కుంచెతో లేగలిగితే ధన్యుణ్ణయాననుకుంటాను."

తాను తన్మయురాలై వింటూన్నది.

"ఒక్క కోరికఉంది శ్యామలాదేవి!"

తన పేరుకూడా అతనికి తెలుసును. ఆ క్షణములో తానెంత గర్వపడింది!

"ఒక్కగంట...మీనాన్నగారి స్టూడియోలో నాకోసం కూర్చుంటారా?"

"అలాగే లెండి."

తేలికగా అన్నది తాను. అతను వెళ్లిపోతూడు కొండలమీదనించి కొండలమీదికి గెంతుతూ ఆడుకోవా లనిపించింది తనకి. అద్దం చూసు కున్నది. తన కళ్ళలో అంత సౌందర్యం ఉందా? అతని మెప్పుని పొందేంత సౌందర్యం?

ఆ రోజంతా పువ్వులమీద గడిపింది తను.

చీకటిపడేక తాను బాల్కనీమీద నిలబడి ఊరిలోని దీపాలమధ్యకి చూస్తూ ఆలోచించ సాగింది. తనచుట్టూ దీపాలు, ఊరిలో దీపాలు, ఇంటింటా బారులుతీర్చిన దీపాలు, వరుసలుదిద్దిన జ్యోతులు, తన మనస్సులో ఉన్న దీపాలకి అధి వాస్తవిక ప్రతిబింబాలలా అనిపించింది శ్యామలకి.

ఇట్లో అందరూ పనుల్లో ఉన్నారు. తాను అలాగే ఆలోచించసాగింది. ఈదీపాలిలాగ ఉండి పోతే! ఎప్పుడూ కాలం కదలకుండా నేఉండిపోతే!

"నమస్కారం శ్యామలా దేవి!"

ఉలిక్కిపడిది తాను. అతను మళ్ళా, అన్నను! అతను కొద్దిదూరంనించి తనవైపు అలాగే చూస్తూ నిలబడ్డాడు. తనకెందుకో శరీరం అంతా కాంతిగా మారిపోయి, పైన కాంతిలో కలిసి పోతూన్నట్లనిపించింది.

"దీపాలు చూస్తున్నారా?"

"అవును. బాగున్నాయికదూ?"

"చాలా... కాని, మీ కళ్ళల్లో కాంతిమీద ప్రశాంతంగా, ప్రకాశవంతంగా ఉంది. ఊరంతా తిరిగాను చక్కటి బొమ్మకి ఐడియా దొరుకుదం దని. చివరి కిలాగ వచ్చాను. నా మూర్ఖత్వం ఇప్పటికి తెలిసివచ్చింది. ఈ దీపాలన్నీ, చీకటి ఉంటేనే ప్రకాశిస్తాయి. మీ కళ్ళు ప్రకాశానికే అందాన్నిస్తాయి."

అతను మరేమీ మాట్లాడలేదు. కొద్ది క్షణాలు అలాగే తానూ అతనూ ఉండిపోయారు.

"సెలవు శ్యామలాదేవీ! మళ్ళా మనం త్వరలో కలుసుకుంటాం అనుకోను, రేపు వెళ్తున్నాను."

చెంపదెబ్బలాగ తగిలింది... రేపు...

"ఇవాళ ఇంటినుంచి ఉత్తరం వచ్చింది. మా అమ్మాయికి చాలా జబ్బుగా ఉందని, వెళ్ళాలి. నా పనీ ఇక్కడ అయిపోయింది. ఇంటికి వెళ్ళి బొమ్మలు వేస్తాను. మీకు కాపీ పంపుతాను."

కాలిక్రింద ఉన్న సిమెంటు కట్టడం కరిగి పోతూన్నట్లయింది. అతను ఆ చీకట్లోకి వెళ్ళి పోతున్నాడు.

ఎన్నాళ్ళనించో కంటూన్న కలలు, నిజమై నట్లు కల, చీకట్లో కలిసింది.

తరువాత అతను వెళ్ళిపోయాడు. బొమ్మలు వేశాడు. తనకి అవి చూడాలనిపించలేదు.

దీపావళి పేరు చెప్పినప్పుడల్లా అదంతా జ్ఞాపకం వస్తుంది. దొంగాటలో దొంగ నిజంగా మాయమయిపోయినట్లనిపిస్తుంది.

అదే, రెండు సంవత్సరాలక్రితం, అతను...

అద్దంలో చూసుకునేసరికి తన తెల్లటి నుదురూ కళ్ళూ తననే వెక్కిరించినట్లనిపించింది శ్యామలకి. భర్తా, సంసారమూ, ఇవన్నీ తనకెప్పుడూ హేళన చేస్తోన్నట్లే అనిపిస్తూంటాయి.

దీపావళి మరీని, ఆ దెబ్బలన్నీ జ్ఞప్తికి వస్తాయి.

సాయంత్రం అట్లాగే ఆలోచిస్తూ బాల్కనీ మీద నిలబడి చీకటినీ, దానిని అలంకరిస్తూన్న చిన్న చిన్న దీపాల వరుసల వందలనీ చూస్తోంది శ్యామల. మధ్యమధ్య టపాకాయలూ, తారా జువ్వలూ ఆమె అవధానాన్ని బలంగా లాక్కు పోతూన్నా, ఆ దీపాలమధ్య, ఈ చీకట్లలో తన జీవితాన్ని గురించి ఆమె ఆలోచించుకుంటూన్నది.

ఎక్కడో నిలబడి తనన తను చూస్తున్నాడని శ్యామల అనుకున్నది.

అవును. సత్యంకి కావల్సినదీ తన సౌందర్యమే. అందుకే తానింత పొడిగా జీవితం గడపాల్సి వచ్చింది. కొంచెం ఈ మెరుగు పోయాక తానెవరికి కావాలి?

ఆ మాటే ఆమె పదేపదే ఆలోచిస్తుంది.

ఈ సౌందర్యం కాకుండా, ఆ కళ్ళు కాకుండా ఆ నుదురు ముంగురుల అందం కాకుండా, తా నెవరికి కావాలి?

సత్యానికి కనిపించేవి అవే. తనన తనెన్నడూ చూడడు... చూడలేదు.

చీకట్లు చిక్కబడినకొద్దీ దీపాలు కాంతులు ప్రస్ఫుటాలు అవుతున్నాయి. తగిన గమ్యస్థానం గురించి ఆలోచించుకుంటూ శ్యామల అలానే నిలబడింది.

తనచుట్టూ చీకటినిండా దీపాలు.

నెమ్మదిగా వొంగి, క్రిందనున్న దీపాల వరుసలు చూడబోయింది శ్యామల. చేతికి చుట్టుకున్న చెంగు చిన్న ప్రమిదని రాసుకుని అంటుకుంది. మంట ఒక్కసారిలేచి నుదురుకి తగిలింది.

ఛ్రరున వొచ్చిన మంటనించి శ్యామల త్వరగా తప్పించుకో లేకపోయింది. నుదురంతా కాలే దాకా చీరని ఉన్నమంటా ఆరలేదు. తరువాత-

బాధగా కళ్లు తెరిచింది శ్యామల. నుదురు అంతా విపరీతంగా బాధిస్తూన్నది. కట్టుకట్టారులా ఉంది.

"ఎలాఉంది శ్యామా?"

సత్యం నెమ్మదిగా అడిగాడు. శ్యామల తెల్లబోయినట్లు చూసింది. ఆ ఆప్యాయం ఇంకా.

"ఎలాఉంది?"

మళ్ళీ అడిగాడు.

"ఆ అద్దం ఓసారి."

అతను తెచ్చిఇచ్చాడు.

"కట్టు విప్పండి."

"ఎందుకు?"

"ఒక్కసారి విప్పండి."

"ఒద్దు శ్యామా చాలా బాధ పెడుతుంది. వొద్దు."

"కాదు-వెంటనే కట్టుకుంటానుగా!"

నెమ్మదిగా ఆకట్టు విప్పాడు సత్యం. నుదుటినిండా నల్లటిగాయం. ఒక కంటిక్రింద పెద్ద మచ్చ అద్దంలో.

"అసహ్యంగా ఉందికదూ?"

"లేదు శ్యామా. ఏమిటాప్రశ్న?"

"చెప్పండి."

"లేదు. ఏమీ అసహ్యంలేదు. కొద్దిరోజుల్లో అంతాపోతుంది."

"మచ్చలు ఉంటాయి."

"ఉండనీ"

అతను అద్దం తీసుకుని దూరంగా పెట్టేడు. ఆమె మళ్ళా మంచంమీద పడుకుని ఒకసారి కళ్లు మూసుకుంది.

కళ్లు తెరిచేసరికి అతడు ఎదురుగా నిలబడ్డాడు. తన కళ్ళల్లోకి చూస్తూ.

"కట్టుకట్టేదా శ్యామా?"

ఆ ఆప్యాయంతోనే అడిగాడతను దగ్గరగావొస్తూ.

"ఒద్దు. అవసరంలేదు."

నెమ్మదిగా అతనిచేతులు తన చేతులలో తీసుకుంటూ అన్నది శ్యామల.

"ఏమా?"

"దీపావళి వొచ్చింది. అందుకనీ."

---

కథానిక

# మునిమాపు వయస్సులో—

బి. ఏ. రమణారావు

అసలేదైనా చదవవలసివస్తే ఎడమవైపునుంచి కుడివైపుగా చదువుతాం. ఉరుదూ భాష కుడినుంచి ఎడమవైపుగా చదువుతారు. చైనా భాష పైనుంచి కిందికి నిలువుగా చదవాలిట. మా అల్లుడు మహాశయుడి ఉత్తరంమాత్రం నేను కిందనుంచి పైకి చదువుతాను. ఎంచేతంటే ఆ ఉత్తరంయొక్క సారాంశం చివరి అంగుళం మేర లోనూ యిమిడివుండి ధగధగ మెరుస్తూ వుంటుంది. ఒక్కొక్కసారి దానికేసి చూసేటప్పటికి కళ్లు చీకట్లు కమ్మడం కూడా కద్దు. ఇంతకి యీనెల వచ్చిన ఉత్తరంలో ఆఖరు వాక్యం యిది. "అందుచేత యీనెల మీరు పంపించవలసినది...రు. 150."

ఏనెల కానెల ఖర్చు తగ్గించమని నేను రాస్తూనే వున్నాను. మరి వాడి ఖర్చులేమో నాబోదకాలులాగ పెరగడమేకాని తరగడం కనబడటంలేదు. నూటయాభై రూపాయలు. హుం ఇంతోటి బి. ఏ. చదువుకీ. తర్వాత వీడు నెలకి నూటయాభై కాన్లు సంపాదిస్తాడో లేదో కాని, ఏమయితే అయింది ఈ నెల నూరు పంపిస్తాను. అంతే, అసలు నాకు యీ బ్లడ్‌ప్రెషర్ రోగం వీడి మూలాన్నే వచ్చింది. అదుగో, వంటింట్లో